

లారెల్ సౌజన్యంతో విద్యా సామగ్రి బహూకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



కోరుకొండ మండలం గాడాల జడ్‌పి హై స్కూల్ విద్యార్థులకు లారెల్ స్కూల్, సిబ్బంది సౌజన్యంతో విద్యా సామగ్రిని శుక్రవారం బహూకరించారు. శిక్షసప్తః కార్యక్రమంలో భాగంగా జడ్‌పి స్కూల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు వీటిని అందించారని హెచ్‌ఎం నిర్మలజ్యోతికుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో లారెల్, స్కూల్ ఉపాధ్యాయులు ఎమ్.ఎస్.ఎమ్.డి. అమీరున్నీసా, పి.అఖిల్, స్టేట్ అవార్డీ శిరీష కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

లంకలను వీడని ముంపు

- ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న ఉధృతి
- భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

గోదావరి వరద నుంచి లంక ప్రజలు ఇంకా విముక్తి రాలేదు. ఇంకా లంకలను ముంపు వీడలేదు. తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని గోదావరి లంకల్లో వరద నీరు ఇంకా తగ్గలేదు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో 60 ఇళ్లను వరద ముంచెత్తింది. నిర్వాసితులు మెరక ప్రాంతంలో ఉన్న బంధువుల ఇళ్లకు తరలివెళ్లారు. అల్లవరం మండలం పల్లిపాలెం గ్రామంలోకి మోకాళ్లోతులో వరద నీరు చేరింది.



అల్లవరం మండలం పల్లిపాలెంలో ఇళ్లల్లోకి చేరిన వరద నీరు

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరికలు

గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. గోదావరి ఎగువన కురుస్తున్న వర్షాలతో క్రమంగా పెరుగుతోంది. గురువారం తగ్గిన ప్రవాహం శుక్రవారం నాటికి మళ్లీ పెరిగింది. భద్రాచలం 48.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద ప్రవాహం 13.60 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. కాటన్ బ్యారేజీ నుంచి 175 గేట్లను పైకి లేపి 12,58,268 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 5,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ముమ్మిడివరం మండలంలో లంక ఆఫ్ ఠానేలంక, కూనలంక, గురజాపులంక, చింతలంక, కాట్రేనికోన మండలంలో పల్లంకుర్రు, పి.గన్నవరం మండలంలో శివాయలంక, చినకందవపాలెంలో ఇళ్ల ముంగిటకు వరద నీరు చేరింది. ఆలమూరు మండలంలో బడుగువాని లంక, తోకలంక అయినవిల్లి మండలంలో వల్లపులంక, అయినవిల్లిలంక, శానిపల్లిలంక, పొట్టిలంకల్లో మోకాళ్లోతు వరద నీరు నిలిచే ఉంది. రామచంద్రపురం మండలం కోటిపల్లి రేవు పూర్తిగా నీటమునిగింది. కోటిపల్లిలంకకు రాకపోకలు స్తంభించాయి.

కపిలేశ్వరపురం మండలంలోని నారాయణలంక, కేదార్లంక, తాతపూడి, కోరుమిల్లి, అద్దంకివారి లంకల్లోకి వరదనీరు పంటపొలాల్లోకి చేరింది.

ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

కోనసీమ జిల్లాలో 5,100 మంది రైతులకు సంబంధించి 4వేల ఎకరాల్లో అరటి, కూరగాయలు, బొప్పాయి, పువ్వులు, తమలపాకు తోటలు ముంపునకు గుర్రైనట్లు అధికారులు గుర్తించారు. తూర్పు గోదావరి జిల్లాలో వర్షాలు, గోదావరి వరదలకు సుమారు 1,700 ఎకరాల్లో 1,150 మంది రైతులకు చెందిన ఉద్యాన పంటలు ముంపునకు గుర్రైనట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

పునరావాస కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

రాజమహేంద్రవరం : పునరావాస కేంద్రాలను సక్రమంగా నిర్వహించి వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరద ఉధృతి కారణంగా 250 మందిని స్థానిక ఆల్కట్ గార్డెన్స్‌లోనినగరపాలక సంస్థ కళ్యాణ మండపం, 198 మందిని చందా సత్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పాటు సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నామనానరు. రెండు చోట్లా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పిఎం.సత్యవేణి, ఎస్‌ఇ జి.పాండురంగారావు, మున్సిపల్ ఆరోగ్య శాఖాధికారి ఎ.వినూత్న సిబ్బంది ఉన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రభుత్వం ఆదుకోవాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాలు, కొవ్వాడ వరద కారణంగా తీవ్రంగా నష్టపోయాం. తాళ్లపూడి మండలంలోని పెద్దేవం, రావూరుపాడుతో పాటూచుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 200పైగా ఎకరాల్లో ఆకుకూరలు పండిస్తున్నాం. వర్షాలు, వరదల వల్ల పుదీనా, కొత్తిమీర, చుక్కకూర, తోటకూర, పాలకూర వంటి అనేక రకాల ఆకుకూరలు పంటలు కుళ్లిపోయాయి. పెట్టుబడి మొత్తం పోయింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- రాధాకృష్ణ, పెద్దేవం, తాళ్లపూడి మండలం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

మహిళలపై దాడులను అరికట్టాలి

- చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

మహిళలపై దాడులను అరికట్టాలని, చట్టాలను పటిష్టంగా అమలు చేయానలి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రతిభ ఒకేషనల్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో 'మహిళలపై జరుగుతున్న దాడులు - తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా అధ్యక్షత జరిగిన ఈ సెమినార్‌కు ప్రసన్నకుమార్ హాజరై మాట్లాడారు. దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు మహిళలపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. నెల రోజులుగా బాలికలపై జరిగిన అత్యాచారాలు బాధాకరమన్నారు. ఈ నెలలోనే ఇలాంటి ఘటనలు 14 బయటకు వచ్చాయన్నారు. నంద్యాల జిల్లా ఘటనతో ఇతర ఘటనలు బయటకు వచ్చాయన్నారు. బయటపడని ఎన్నో ఘటనలున్నాయన్నారు. విజయనగరంలో ఆరు నెలలు పసికందుపై జరిగిన దాడి కలిచివేసిందన్నారు. ప్రభుత్వాలు ఘటన జరిగిన సందర్భాల్లో హడావుడిగా చట్టాలను తీసుకొచ్చి చేతులు దులిపేసుకుంటున్నాయని విమర్శించారు. కాని ఘటనలను నివారించే చర్యలు మాత్రం తీసుకోవట్లేదన్నారు. ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. మద్యం, మత్తుపదర్థాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పురుషాధిక్య భావజాలాన్ని విడనాడి, అసమానతలు లేని సమాజాని కోసం కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులకు వస్త్రధారణ కారణం కాదన్నారు. అదే అనుకుంటే ఆరు నెలల పసికందు ఏ విధంగా వస్త్రధారణతో కనపడిందని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో వస్తున్న సినిమాలు, యాడ్స్, ఇతర మాధ్యమాల్లో మహిళలను వస్తువుగా చూపిస్తున్నారన్నారు. అటువంటి వాటిని బ్యాన్ చేయాలన్నారు. పాఠ్యపుస్తకాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన పెంచాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీలో మనుస్మృతిని పాఠ్యాంవంగా తీసుకురావడం దారుణమన్నారు. మహిళలు ఇంటికే పరిమితం అవ్వాలి అని చెప్పే మనుస్మృతిని కోర్సుగా తీసుకురావడం అంటే కేంద్ర ప్రభుత్వం మహిళల పట్ల ఎలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉందో స్పష్టం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం భేటి పడావో - భేటి బచావో అని మాటల్లో చెప్పటం కాదు మహిళలపై నిజంగా నిబద్ధత ఉంటే పోర్న్ సైటులను బ్యాన్ చేయించాలన్నారు. చట్టాలను పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంజీవరావు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, కమిటీ సభ్యులు సురేష్, ఐద్వా జిల్లా అధ్యక్షులు రజీనా, సీనియర్ నాయకులు సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా జనసేన పార్టీ

ప్రజాశక్తి - గోపాలపురం


నాయకులకు, కార్యకర్తలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. శుక్రవారం దొండపూడిలో జనసేన 4వ విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జనసేన మండల అధ్యక్షులు పోల్నాటి రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సువర్ణరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రియాశీలక సభ్యత్వం ఉద్దేశం, ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిలకా నాశ్వరరావు, పోసిన గణపతి , రామ్ లీలాధర్, మద్దాల సనారి , షేక్ బద్రి, పోతిరెడ్డి వీరాస్వామి, దొండపూడి జనసేన నాయకులు పాల్గొన్నారు.

కేసుల ఎత్తివేతపై హర్షం

ప్రజాశక్తి - తాళ్లపూడి

సిపిఎస్ విధానానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యోగులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు కార్యదర్శి మూర్తి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు తెలిపిన ఉద్యోగులపై నిర్బంధాన్ని సాగించిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కేసులు ఎత్తివేయడం హర్షణీయమన్నారు. అలాగే ఉద్యోగులకు ఇవ్వాల్సిన వివిధ బకాయిలను వెంటనే విడుదల చేసేలా చూడాలని కోరారు.

కార్టూ'నిజం'



ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

ఎస్‌పి డి.నరసింహకిషోర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజల మాన, ప్రాణ రక్షణే పోలీసుల ధ్యేయమని, దాని కోసం అందరకూ ఐక్యంగా పనిచేయాలని ఎస్‌పి డి.నరసింహకిషోర్ పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ పోలీస్, సివిల్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్, హోంగార్డులు కవాతు నిర్వహించారు. దీన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే వాటిని ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. సిబ్బంది అందరికీ ప్రతి శుక్రవారం పెరేడ్ నిర్వహిస్తామన్నారు. అన్ని విభాగాలకు సంబంధించి అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారన్నారు. ఆరోగ్య విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారుల సహాయంతో వైద్యం పొందాలన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎస్‌ఆర్.రాజశేఖర్ రాజు, అడిషనల్ ఎస్‌పి(ఎఆర్) ఎల్.చెంచిరెడ్డి, డిఎస్‌పి(ఎఆర్) రవికుమార్, జోనల్ డిఎస్‌పిలు తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి నరసింహకిషోర్

మనుషుల అక్రమ రవాణాను నిరోధించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.అచ్చియమ్మ అన్నారు. హైదరాబాద్‌కి చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మనుషుల అక్రమ రవాణాపై సిడిపిఒ కార్యాలయంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చియమ్మ మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. ప్రతి రోజు ఎంతో మంది యువతులు, మహిళలు దీనికి గురవుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు దీనిపై అవగాహనా కలిగి ఉండాలన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేర మోసం చేసి విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికీ అవగాహనా కల్పించి రక్షించాలని సూచించారు. ప్రజ్వల కో-ఆర్డినేటర్ శ్రావ్యశృతి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టడంలో అందరు భాగస్వామ్యం కావాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్ గాని, కాల్స్ గాని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాంటి సందర్భాల్లో 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అంగన్‌వాడీలకు లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగవేణి, రమణ, ప్రజ్వల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్స్ శివ, సుప్రియ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంల ఐసిడిఎస్, ప్రజ్వల సిబ్బంది

పోలీస్ విధి, విధానాలు తెలియజేయాలి

ఉండ్రాజవరం : పోలీసు స్టేషన్‌లో వాస్తవంగా ఏమి జరుగుతుందో, పెద్ద, చిన్న చట్టాలు, సాధారణ నేరాల్లో నేరస్థులపై తీసుకునే చర్యల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని ఉండ్రాజవరం హెచ్‌సి వి.బొజ్జి అన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆఫ్రో సంస్థ ఏర్పాటు చేసిన పోలీసు వ్యవస్థ విధి విధానాలు, పోలీసులు, బాలల చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో భాగస్వాములైన బాలలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగే చర్యల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, టెన్నికాయిట్ తదితర ఆట వస్తువులను ఆఫ్రో సంస్థ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి, ఆఫ్రో సంస్థ ఫీల్డ్ ట్రైనర్ ఆర్.అనూష విద్యార్థులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

పరిసరాల శుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని రాజంపాలెం సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి కోరారు. గ్రామం పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేందుకు పూడిక తీత పనులు చేపట్టామన్నారు. చెత్తాచెదారాన్ని తొలగించామన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్తను వేయరదాన్నారు. ముఖ్యంగా డ్రెయినేజీల్లో చెత్త వేయరాదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రోటరీ కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ 2024 - 25 సంవత్సరం నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణస్వీకారం చేసింది. డాక్టర్ బిఆర్.అంబెద్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్లో క్లబ్ అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధ్యక్షునిగా రాచర్ల చైతన్యబాబు, కార్యదర్శిగా ఆకుల రాజీవ్, కోశాధికారిగా కొయ్యే కృష్ణంరాజు, డైరెక్టర్లతో రోటరీ జిల్లా 3020 గవర్నర్ నామిమి గుత్తికొండ శ్రీరామ్ ప్రమాణస్వీకరం చేయించారు. ఈ కార్యక్రమలోగాలి రాఘవయ్య, ఐ.శేఖర్, పెచ్చెట్టి ఫణిసింహ, ఇంజే ఝాన్సీరాణి, గుబ్బల సత్యప్రసాద్, కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఫాగింగ్

ప్రజాశక్తి - చాగల్లు

వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నాలుగు రోజులుగా పాగింగ్ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. శుక్రవారం చాగల్లు శివారు ఇందిరమ్మ కాలనీలో దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ నిర్వహించామన్నారు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు సూచించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుర్వసనాలకు దూరంగా ఉండాలి

తాళ్లపూడి : దుర్వసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ అధ్యక్షతన 'డ్రగ్స్ రహిత సమాజం కోసం మనం అందరం' అనే కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా జాగ్రత్తగా చదువుకోవాలన్నారు. చదువు లేకుంటే జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపణీ

గోకవరం : మండలంలోని గాదెలపాలెం ఎంపిపి పాఠశాల విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం నాగభూషణం ఆధ్వర్యంలో విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గళ్ల కృష్ణ, టిడిపి జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యతోనే ప్రగతి సాధ్యమన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

తాళ్లపూడి : అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టిడిపి యువనాయకుడు అల్లూరి విక్రమాధిత్య హెచ్చరించారు. అన్నదేవరపేటలో పాఠశాలలకు అందిస్తున్న కోడిగుడ్లను విక్రమాదిత్య పరిశీలించారు. నాణ్యత లోపంతో కుళ్లిన గుడ్లను గుర్తించారు. సదరు కాంట్రాక్టర్‌ను పిలిపించారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ-2 నెహ్రూ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యకుమారి శుక్రవారం అన్నదేవరపేటకు చేరుకుఇ పరిస్థితులను పరిశీలించారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ

ప్రజాశక్తి- కడియం

సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ సంస్థ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని జక్కంపూడి నగర్ ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం కె.సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ తరపున, ఆ సంస్థ సభ్యులు ట్రెజరర్ యేరుకొండ వెంకటేష్ పాఠశాలకు రూ.16వేల విలువైన సౌండ్ సిస్టంను బహూకరించారు. భవిష్యత్‌లో పాఠశాల ఆవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానినిన వెంకటేష్ హామీనిచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాలలో ఐదు తరగతులు ఉన్నాయని, కానీ ముగ్గురే ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. చదువుకున్న యువతీ యువకులు వాలంటీర్లుగా రావాలని కోరారు. సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షులు ఆదిమూలం సాయిబాబా మాట్లాడుతూ పాఠశాలలో టీచర్ల కొరత సమస్యను మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సురేష్, విజయలక్ష్మి, సత్యవతి, సుదర్శనం, రాజేశ్వరరావు, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పెరవలి

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఎంఇఒ షేక్ నూర్జహాన్ సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ అవగాహన కార్యక్రమం 9 10 తరగతులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిజిటల్ టెక్నాలజీ నైపుణ్య అభివృద్ధి గురించి, సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్ర సాంకేతిక రంగాల విశిష్టతను వివరించారు. డిజిటల్ టెక్నాలజీలో విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. అనంతరం టెక్నికల్ లెక్చరర్ ఎం.సురేష్ మాట్లాడారు. నైపుణ్య అభివృద్ధి కోర్సులు, డిజిటల్ టెక్నాలజీ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండివి.ప్రసాదరావు, నాగార్జున, మూర్తి, బాలకృష్ణ, రాములమ్మ, రవికుమార్ విద్యార్థి తదితరులు పాల్గొన్నారు

పాడి రైతులకు దాణా పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి, ముక్కామలలో 440 మంది పాడి రైతులకు 25 మెట్రిక్ టన్నుల దాణాను శుక్రవారం పంపిణీ చేశారు. ఇటీవల వచ్చిన గోదావరి వరద, వర్షాల నేపథ్యంలో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో దాణాను స్థానికు నాయకుల చేతులమీదుగా అందించారు. ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించి 200 పాడి పశువులకు టీకాలు, 40 పశువులకు వైద్యం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పులిదిండి నాగరాజు, కేతా త్రిమూర్తులు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ రవివర్మ, ఉప సర్పంచ్ అతికాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పైప్ లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలోని ఎస్‌సి ఏరియా, హాస్టల్ పరిసర ప్రాంతాల్లో ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాల మేరకు సర్పంచ్ కడిమి వీరకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం పైప్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్, కార్యదర్శి హరిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విక్టర్ పాల్, మణి బాబు పాల్గొన్నారు .

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా శనివారం ట్రీకటింగ్ తదితర పనులను నిర్వహించనున్నామని, ఈ కారణంగా పెరవలి, నల్లాకులవారిపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) బి.వీరభద్రరావు, ఎఇ డేవిడ్‌నిశ్చల్ తెలిపారు. వినియోగదారు గమనించి సహకరించాలన్నారు.

శానిటేషన్ పనులు నిర్వహించాలి

గోకవరం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని అచ్యుతాపురం గ్రామ టిడిపి అధ్యక్షులు కోలా ఏసుబాబు, పిట్ట అరుణ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో వారు పర్యటించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలో సీజనల్ వ్యాధులు అంటూ వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. వెంటనే పారిశుధ్య పనుల చేపట్టాలన్నారు. డ్రెయినేజీల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివయ్య, సచివాలయం కార్యదర్శి ప్రణవ్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో యనమదల గ్రామంలో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధించినట్లు ద్రాక్షారామ ఎస్ఐ గెల్లా సురేంద్ర తెలిపారు. వివరాలు ఇవి.. 6.09.2015న సాదే జనార్ధన రావుకు సంబంధించి భూ సరిహద్దు లోకి ధారా అప్పారావు, అతని కుమారులు దారా సింహాద్రి, దారా చంటి, ధారా రాజశేఖర్ కత్తులతో కర్రలతో వచ్చి సాదే జనార్ధనరావుపై దాడి చేశారన్నారు. ఈ దాడిలో జనార్ధనరావు చనిపోయాడని, మతుని రెండవ కుమారుడు సాదే దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ద్రాక్షారామ ఎస్ఐ కె.వంశీధర్ కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ పి.కాశీ విశ్వనాథం దర్యాప్తు చేసి నిందితులు ధారా అప్పారావు, దారా సింహాద్రి, దారా చంటి, ధారా రాజశేఖర్‌ను అరెస్ట్ చేశారు. రాజమహేంద్రవరం కోర్టులో స్పీడీ ట్రయిల్ కేసుగా కేసును ట్రయిల్ జరుగగా, పిపి జి.వెంకట రత్నం బాబు, ప్రాసీక్యూషన్ వాదోపవాదాలు జరిగాయి. అనంతరం జడ్జి ఆర్. శ్రీలత నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికీ రూ.5 వేలు జరిమానావిధించినట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

పొన్నమండ సర్పంచ్ అరెస్ట్

ప్రజాశక్తి-రాజోలు

ఒక యువతిని మోసం చేసిన కేసులో రాజోలు మండలం పొన్నమండ గ్రామ సర్పంచ్ కుక్కల బేబీ కుమారిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో ఆమెను హాజరు పరశగా న్యాయమూర్తి ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించారు. వివరాల్లోకి వెళితే పొన్నమండ సర్పంచ్ కుక్కల బేబీ కుమారుడు చిన్న కుమారుడు స్టాలిన్ అదే గ్రామానికి చెందిన సరెళ్ల తేజస్విని అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్దల సమక్షంలో ఎన్ని సార్లు అడిగిన పెళ్లికి నిరాకరించడంతో పాటు సర్పంచ్ బేబీ కుమారి,ఆమె పెద్ద కుమారుడు కుక్కల లెనిన్, బుంగ అశోక్ తనపై బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలు తెలిపింది. తేజస్విని ఫిర్యాదు మేరకు రాజోలు సిఐ కేసు నమోదు చేశారు. ఏ1 నిందితుడు పరారీ లో ఉన్నాడని అతని తల్లి బేబీకుమారిని అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించామని సిఐ ఆర్.గోవింద రాజు తెలిపారు.

ఆటో చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సామర్లకోట

ఇంటి బయట ఉంచిన ఆటో దుండగులు చోరీ చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. జగ్గమ్మగారిపేటలో వెంకట శివకు చెందిన ఆటోను గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఇద్దరు నిక్కర్లు వేసుకున్న దుండగులు అపహరిస్తున్నట్టు ఆ ప్రాంతంలో సిసి కెమేరాల్లో నమోదయ్యింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ అంకబాబు తెలిపారు.

ఆభరణాల చోరీ నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-పెదపూడి

జి.మామిడాడ ఆలయంలో చోరీ ఘటనలో నిందితుని అరెస్ట్ చేసి అభరణాలు రికవరీ చేసామని కాకినాడ డిఎస్‌పి కె.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం పెదపూడి స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగి 14 కేజీల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ కేసులో సికింద్రాబాద్‌కు చెందిన అముగోతు రాములు నాయక్‌ను నిందితునిగా గుర్తించారు. అతడి నుంచి 14 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడుపై రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 15 కేసులు ఉన్నాయని డిఎస్‌పి తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం)

మహిళపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేసిన సంఘటన గొల్లప్రోలు నగరంలోని ఎస్‌సి కాలనీలో శ క్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రంగప్ప చెరువు ఎస్‌సి కాలనీలో నివాసం ఉంటున్న ఎన్.రాజ్యలక్ష్మికి సమీపంలోని వేమగిరి రాజేష్‌కు బాత్రూం ప్రహరీ గోడ విషయంమై తగాదా ఉంది. శు క్రవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజ్యలక్ష్మిపై రాజేష్ గొడ్డలితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలు అయిన రాజ్యలక్ష్మిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ శ్రీనివాస్ ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

పంచాయతీ సభ్యుని ఆత్మహత్య

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెంకు చెందిన వైసిపి పంచాయతీ వార్డు సభ్యుడు బొబ్బిలి వీర వెంకట సత్యనారాయణ (35) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోషల్ మీడియాలో టిడిపి, జనసేన నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ అసభ్యకరమైన పోస్టులను పెడుతున్నారని సత్యనారాయణ ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతుని ఇంటి వద్దకు వైసిపి నాయకులు కార్యకర్తలు అధికంగా చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. సంఘటనాస్థలాన్ని పెద్దాపురం డిఎస్‌పి కె.లతాకుమారి, క్రైమ్ సిఐ అంకబాబు, పరిస్థితిని సమీక్షించారు. పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద వైసిపి నాయకులు కార్యకర్తలు మతుని కుటుంబికులు ఆందోళన చేపట్టారు. దోషులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి పెద్దాపురం ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు డిమాండ్ చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

యానాం వార్తలు

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను శుక్రవారం యానాం స్టేట్ బ్యాంకు సెంటర్‌లో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను యానాం విద్యాశాఖాధికారి ప్రవీణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు, జెవివి రాష్ట్ర నాయకులు కె.వి.వి.సత్యనారాయణ, యానాం సమగ్ర శిక్ష అభియాన్ అధికారి కమిడి ప్రభాకర్, దంగేటి త్రిమూర్తులు, కవి తాతపూడి సోమశేఖరశర్మ, ఎన్.రామమూర్తి, ఎస్.కె.వీరభద్రరాజు, పొనుగుమట్ల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పుస్తకాలయంను సందర్శించారు. పుస్తకాలయంలో బాల సాహిత్యం, కథలు, కవిత్వం, నవలలు, విమర్శ, జీవిత చరిత్రలు తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నట్టు వేన్ ఇన్‌ఛార్జి ఎస్.రామకృష్ణ తెలిపారు. చరిత్ర, కులం, మతం, జెండర్, పర్యావరణం, పర్యాటకంతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన గ్రంథాలు ఉన్నట్టు తెలిపారు. విశాలాంధ్ర ప్రచురణలతో పాటు ఎమెస్కో, పెంగ్విన్, జైకో, రీమ్, గీతా ప్రెస్, భూమి బుక్ ట్రస్ట్, హెచ్.బి.టి, తదితర ఆంగ్లం, తెలుగు ప్రచురణ సంస్థల పుస్తకాలు ఉన్నట్టు తెలిపారు. ఈ పుస్తకాల కొనుగోలుపై పదిశాతం డిస్కౌంట్ ఉందన్నారు. మరో మూడు రోజులు పాటు ఈ ప్రదర్శన యానాంలో ఉంటుందని చదవరులు, పుస్తక ప్రియులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కనకాలపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట రామాలయం వద్ద ఉన్న మున్సిపల్ కళ్యాణ మండపంలో శుక్రవారం డయాబెటిక్, జనరల్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు లయన్స్ క్లబ్ కాపులపాలెం గోల్డ్, లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ, లయన్స్ క్లబ్ కనకాలపేట ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ పిల్లారాయ ప్రెసిడెంట్ పులవర్తి శ్రీను తెలిపారు. డాక్టర్ రేణుక అధ్యక్షతన డయాబెటిక్, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 70 మందికి పైగా వైద్య పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, ఎస్ఆర్ఎంటి మూర్తి, కవల గణపతి, గొర్రెల రాజేష్, కోన దేవా, నల్లం సురేష్, కవల తిరుమల నాయుడు, చందు పాల్గొన్నారు.



వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ అశోక్

వరద ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన ఢిల్లీ పర్యటనను ముగించుకుని శుక్రవారం యానాం చేరుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. టైడల్ లాక్, శివం బాత్, బాలయోగి వారధి, కనకాలపేట లంక భూములు కోతకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తు సహాయక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి వరద తగ్గుముఖం పట్టిందని రాబోయే రోజుల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా బ్లీచింగ్ చల్లించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులు సూచించారు. రాజీవ్ బీచ్‌లో పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యూడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, జెఇ జ్యోతి రాజు, ఎస్ఐ మురుగానందం, నాయకులు నక్కల సుబ్బన్న, పండు సిద్ధార్థ కుమార్, వాసిరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

సామాన్యునికి అందుబాటులో ఇసుక ధరలు

ప్రజాశక్తి-అమలాపురం

సామాన్యునికి అందుబాటులో ఇసుక ధరలు ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ అధ్యక్షులు ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆరు స్టాక్ యార్డుల్లో ఇసుక పరిమాణం సరఫరా ఆన్లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్వహణ, అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులపై విచారణ డి-సిల్టేషన్ పాయింట్లు ఎంపిక, ఒక వ్యక్తికి ఆధార్ కార్డు పై రోజువారి 20 మెట్రిక్ టన్నులు ఇసుక సరఫరా అంశాలపై ఆయన సమీక్షిం చారు. కార్యక్రమంలో జిల్లా జెసి టి.నిషాంతి, ఆర్‌డిఒలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌యు డిస్టెన్స్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య విభాగం డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వి.వెంకటేశ్వర్లును మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రావు మాట్లా డుతూ ఎపిలోఅత్యుత్తమ యూనివర్సిటీగా ఖ్యాతి గాంచిన నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా విభాగం మరింత విశిష్ట సేవలు అందజేయాలని ఆకాంక్షిం చారు. అనంతరం వెంకటేశ్వర్లును దుశ్శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్య క్రమంలో మోడరన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో -ఆర్డినేటర్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గుణ్ణం వీర్రాజు, గన్ని విష్ణు, గారపాటి త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం వారు జూనియర్ కళాశాల్లో ప్రభుత్వం నుంచి వచ్చిన ఉచిత నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజులను చారిటబుల్ ట్రస్ట్ చెల్లిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాల్లో చేర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు సాంబశివమూర్తి, అరుణ కుమార్, గోవింద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మహిళలపై జరుగుతున్న సాంఘిక దురాచారాల పైనా, వారి రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలపై ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని ముమ్మిడివరం ఐసిడిఎస్ ఐ.విమల శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సు నిర్వహించారు. కేంద్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచారాల్లో భాగంగా 21 జూన్ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ముమ్మిడివరం పరిధిలోని ఐ.పోలవరం మండల కేంద్రంలో, కొమరగిరి గోడివారి పేట కమ్యూనిటీ భవనం నందు, మురమళ్ళ ప్రాథమికఉన్నత పాఠశాల నందు, గుత్తెనదీవి, జి.జగ్గంపేట అంగన్‌వాడీ కేంద్రాల నందు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారులు సిహెచ్.నాగలక్ష్మి, జె.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఒఎన్‌జిసి నెలకు రూ.18 వేల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఒఎన్‌జిసి, వివిధ ఆయిల్ కంపెనీల వల్ల మత్స్యకారుల జీవన ఉపాధి కి భారీగా నష్టపరుస్తున్నందున ప్రతి నెల రూ.18 వేలు ప్రతి మత్స్యకార కుటుంబానికి ఇవ్వాలని ఎపి మత్స్యకార సంఘం అధ్యక్షులు దోమ ఆదినారాయణ డిమాండ్ చేశారు. జాతీయస్థాయి చిన్న తరహా మత్స్యకారుల సంఘం సమావేశం చెన్నైలో నిర్వహించారు. దక్షిణా రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక ఆంధ్రప్రదేశ్ నుంచి కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. 25, 26 తేదీల్లో జరిగిన సమావేశానికి మన రాష్ట్రం నుండి అధ్యక్షులు దోమ ఆదినారాయణ, ఉపాధ్యక్షులు, సభ్యులు హజరైయ్యారు.

వేలం ద్వారా రూ.7.34 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలో దుకాణాల నుంచి ఆసీలు వసూలుకు, శృంగార వల్లభ స్వామి ఆలయం వద్ద పార్కింగ్‌కు నిర్వహించిన వేలంలో పంచాయితీకి రూ.7,34,000 ఆదాయం సమకూరిందని పంచాయితీ కార్యదర్శి భార్గవ్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి బివివి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వేట్లపాలెం పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి- సామర్లకోట

మండలంలోని వేట్లపాలెంలో ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఇఒ-1 శివరామకృష్ణయ్య సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా ప్రవేశ కార్యక్రమాలను, సంసిద్ధత కార్యక్రమాలు, శిక్ష సప్తాహ్ కార్యక్రమాల అమలును గురించి హెచ్‌ఎంఉన అడిగి తెలుసుకున్నారు. విద్య ప్రవేశ కార్యక్రమాలను దీక్ష యాప్‌లో లాగిన్ అయి ప్రతి ఉపాధ్యాయుడూ ఆప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థుల పఠన నైపుణ్యాలను, రాత నైపుణ్యాలను ప్రతి తరగతికీ వెళ్లి పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్‌లో అంశాలను చదవాలని, రాయాలని దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ముఖ్యంగా పాఠశాలలో నమోదైన ప్రతి విద్యార్థి యుడైస్‌లో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలో 5వ తరగతి పిల్లలందరికీ గణిత అంశం నుంచి స్థాన విలువలను గురించి వివరంగా బోధించి పిల్లలచే కొన్ని సంఖ్యలకు స్థాన విలువలను రాయించారు.



శ్మశాన వాటిక స్థలాఇన్న పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కిషోర్

శ్మశాన వాటిక స్థల పరిశీలన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ పంచాయతీలోని కొత్తపట్నం, బర్మా కాలనీ, సుబ్బంపేటకు చెందిన మత్స్యకార ప్రజలు కొన్నేళ్లుగా శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఉప్పాడ సముద్ర తీరానికి, కాకినాడ ఉప్పాడ బీచ్ రోడ్డును ఆనుకుని ఉన్న సుబ్బంపేటలో కొన్నేళ్లుగా మత్స్యకారులు దహన సంస్కారాలు చేస్తున్నారు. వారు పడుతున్న ఇబ్బందులను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఎస్‌పిజిఐని ఆనుకుని ఉన్న, కాకినాడ అర్బన్ ప్రజలకు ఇచ్చిన భూమిలో మత్స్యకారులకు శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించేందుకు ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, తహశీల్దారు ఎం.సుందర్‌రాజ్ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కృషి చేసినందుకు మూడు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అధికారుల వెంట గ్రామ పెద్దలు పట్టా శివ, మెరుగు భూషణం, దాసరి అర్జునరావు, జోగేంద్రరావు, వనమాడి యల్లారావు, పంతాడ అప్పారావు, రాకాతి రాము, లోవరాజు, పరదేశయ్య పాల్గొన్నారు.

నాక్ గుర్తింపు నిబంధన అన్యాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలకు నాక్ గుర్తింపు లేకపోతే కళాశాల గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం అన్యాయమని ఎపి ఎయిడెడ్ కాలేజెస్, అన్ ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వి.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు నాక్ గుర్తింపు లేకపోయినా విద్యార్థులకు పాఠాలు చెబితే చాలు కళాశాల గుర్తింపు రద్దు చెయ్యనప్పుడు ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలకు నాక్ గుర్తింపు ఎందుకు రద్దు చేస్తారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్ సంస్థలు బలోపేతం చేయాలంటే ముందుగా సరిపడినంత మంది అధ్యాపకులను నియమించాలన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు సరిచేయాలన్నారు. నాక్ గుర్తింపు ఉండాలని గవర్నమెంట్ తప్పనిసరిగా నిర్ణయం తీసుకుంటే అది ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ ఎయిడెడ్ అని తేడా లేకుండా అన్ని సంస్థలకు వర్తించేలా జిఒ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ లెక్చరర్లకే కాక మిగిలిన అన్ ఎయిడెడ్, పార్ట్ టైం, గెస్ట్, ప్రైవేటు లెక్చరర్లకు కనీస వేతనం అమలు చేసేలా జిఒ జారీ చేసి అమలు చేయాలన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఆర్ తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ పూర్తయిన దస్తావేజులకు కొన్ని కారణాలతో ఆన్‌లైన్ సంతకాలు ఆలస్యం అవుతున్నాయని, ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాలను పరిశీలిస్తామన్నారు. జగ్గంపేటలోని రికార్డులను పరిశీలించామన్నారు.

కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, భవనాన్ని పరిశీలించారు. వివిధ రికార్డులను పరిశీలించి ఎస్‌క్మి స్వామి నాయుడుకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను జాగ్రత్తగా నమోదు చేయానలి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాద పూర్వకంగా చూసి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి -సామర్లకోట

మారుతున్న సాంకేతిక యుగంలో విద్యార్థి దశలోనే డిజిటల్ టెక్నాలజీని అవగాహన చేసుకుంటూ సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. శు క్రవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్కిల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌పిల ద్వారా, టాబ్‌ల ద్వారా టెక్నాలజీని ఉపయోగించే మెళకువలను ఉపాధ్యాయులు కెవివి.సత్యనారాయణ, జి.గోవింద్ విద్యార్థులకు వివరించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట

మహిళలు, బాలికలు తమకు రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ పూర్ణిమ అన్నారు. మండలంలోని గొల్లలగుంటలో శుక్రవారం జెడ్‌పిఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి వంద రోజుల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలికలకు సంబంధించి చట్టాల గురించి అందరికీ అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. బాల్యవివాహాలు, మహిళల అక్రమ రవాణా, బాలలపై అఘాయిత్యాలు, భిక్షాటన వంటివి నిర్మూలించాలంటే గ్రామ, మండల స్థాయిలో పలుచోట్ల అవగాహన కల్పించాన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెద్దాపురం : పరిసరాల పరిశుభ్రత ప్రజలందరూ బాధ్యతగా చేపట్టినప్పుడే విజయవంతం అవుతుందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. స్వచ్ఛ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు ఆధ్వర్యంలో స్థానిక పరదేశమ్మ కాలనీలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ పద్మావతి మాట్లాడారు. తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచినప్పుడే ప్రజారోగ్యం బాగుపడుతుందన్నారు. స్థానిక తలుపులమ్మ కాలనీకి, ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లే రహదారి చెత్త మయంగా మారిపోయిందని దాన్నిపరిశుభ్రం చేసినట్టు దావీదు రాజు తెలిపారు. చెత్తను బయట వేయకుండా వాహనాలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.